నేడు మాతృదినోత్సవం

# మాతృ వందనం పద్య కీర్తనం

**శివపంచాక్షరి కన్నా మిన్న ఆ నామం. అష్టాక్షరీ కంటే శ్రేష్ఠం ఆ మంత్రం. హిందీలో ఏకాక్షరీ (ప్రణవం). తెలుగులో రెండక్షరాల పిలుపు... అదే అమ్మ! జనన మరణాలు లేని ఆ శ్రీహరి మాతృమూర్తి ప్రేమ కోరే మానవుడిగా అవతారం దాల్చాడంటే అతిశయం కాదు. వామనుడిగా వచ్చి అదితి ఆదరణ చూరగొన్నాడు. రామయ్యగా అవతరించి కౌసల్య పొత్తిళ్లలో ఆడుకున్నాడు. ఒక తల్లి వాత్సల్యం సరిపోదనుకున్నాడో ఏమో.. కృష్ణమూర్తిగా పుట్టి దేవకి, యశోదల గారాలపట్టి అయ్యాడు. దైవాన్ని సైతం అబ్బురపరిచే అమృతత్వం అమ్మది. అందుకే సృష్టికి ప్రతిసృష్టి చేసే అమ్మకు తొలి వందనం అంకితమిచ్చారు.**



గర్భవాసం దుర్భరం అని చెబుతుంది పురాణ వాఙ్మయం. పాపపుణ్యాల లెక్కలు తేల్చుకొని ఓ గర్భంలో పడగానే ఆ జీవి తల్లడిల్లుతాడట. తనను మోస్తున్న తల్లి నవమాసాలూ పడే యాతన కన్నా.. గర్భస్థ శిశువు అనుభవించే వేదనే ఎక్కువట! పూర్వజన్మ వాసనల వల్ల మళ్లీ పుట్టడానికి అనుక్షణం జంకుతుంటుందట! అమ్మకు కాన్పు కాగానే.. బిడ్డ ఏడుపు మొదలు. బొడ్డు పేగు తెగడంతోనే కొత్త జన్మ ప్రారంభం. ఇన్నాళ్ల బాధలన్నీ.. అమ్మ చేతి స్పర్శతో మాయం. మాతృమూర్తి తనను గుండెలకు హత్తుకున్న క్షణంలో శిశువు హమ్మయ్య అని ఊపిరి తీసుకుంటుంది. అమ్మ స్పర్శ మహిమ అది. ఈ లోకానికి తొలి వాకిలి అమ్మే! ఆమె చల్లని చూపుతోనే మరో మేలైన జన్మ మొదలవుతుంది.

**అమృతానికి, అర్పణకు అసలు పేరు అమ్మ**
**అనుభూతికి, ఆర్ద్రతకు ఆనవాలు అమ్మ**
**ప్రతి మనిషి పుట్టుకకే పట్టుగొమ్మ అమ్మ**
**ఈలోకమనెడి గుడిజేరగ తొలివాకిలి అమ్మ**

అమ్మ గొప్పదనాన్ని చెబుతూ సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ రచించిన పద్యమిది. ఇందులో ప్రతి పాదమూ ప్రపంచాన్ని అమ్మకు పాదాక్రాంతం చేస్తుంది. 'ఈ లోకంలోకి ప్రవేశించడానికి తొలివాకిలి అమ్మ' అన్న ప్రయోగం ఈ సుకవి మాతృమూర్తికి చేసిన సిసలైన నమస్కృతి!

తల్లి పెంపకం ఎంత ఇంపుగా ఉంటే పిల్లల పెంపు అంత సొంపుగా ఉంటుంది. ఆర్యాంబ ఆలనాపాలనా శంకరుణ్ని... ఆదిశంకరుడిగా, జగద్గురువుగా తీర్చిదిద్దింది. ప్రపంచంలోని ఏ బంధానికీ చిక్కుబడని శంకరాచార్యులు అమ్మకు మాత్రం కట్టుబడ్డాడు. సన్యాసాశ్రమ నియమాలు పక్కనపెట్టి అవసాన దశలో ఉన్న తల్లి చెంతకు చేరుకుంటాడు. తనకు జన్మనిచ్చి, బుద్ధినిచ్చి, లోక కల్యాణానికి పురిగొల్పిన తన మాతృమూర్తికి తానే స్వయంగా ఉత్తరక్రియలు నిర్వహిస్తాడు. ఈ సందర్భంగా తన తల్లిపై మమకారంతో శంకరులు చెప్పిన ఐదు శ్లోకాలు 'మాతృపంచకం'గా లోక ప్రసిద్ధి చెందాయి.

